అభివృద్ధి పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట : ఉదయం, సాయంత్రం వేళల్లో ఉద్యాన వనాలకు వచ్చే ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగించేలా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. కోట్లాది రూపాయలతో అంబర్‌పేట నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న ఉద్యానవనాల్లో మెరుగైన వసతుల కల్పనలో భాగంగా అభివృద్ధి, సుందరీకరణ పనులను చేపట్టామన్నారు. నల్లకుంట డివిజన్‌లోని నరేంద్ర పార్క్‌లో కొనసాగుతున్న అభివృద్ధి, సుందరీకరణ పనులను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఉద్యానవన, జీహెచ్‌ఎంసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్కులో పిల్లలు ఆడుకునేందుకు వస్తువులు, చిన్నా పెద్దల ఆరోగ్యం కోసం ఓపెన్ జిమ్, చిన్నారుల కోసం ఏర్పాటు చేస్తున్న జారుడు బల్లలు, బాలెన్స్ రాడ్, ఉయ్యాలలు, ఫౌంటెన్ నిర్మాణ పనులు, పార్క్ చుట్టూ ఫెన్సింగ్, ప్రధాన ద్వారం వద్ద ఆర్చ్ నిర్మాణం పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ డీఈ ప్రవీణ్, ఏఈ దివ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, కాంట్రాక్టర్ హుస్సేన్, బీఆర్‌ఎస్ నేతలు ఉన్నారు.

పేద బ్రాహ్మణులకు ఎమ్మెల్యే చేయూత..

అంబర్‌పేట: పేద బ్రాహ్మణులకు తనవంతు చేయూతనిచ్చేందుకు చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం నియోజకవర్గంలోని వివిధ ఆలయాల్లో పురోహితులుగా పని చేస్తున్న 13 మంది పేద బ్రాహ్మణులు రూ.5 వేల చొప్పున నగదు సాయాన్ని వ్యక్తిగతంగా ఎమ్మెల్యే అందించారు. పురోహితులను ఆదుకోవడం తనకెంతో సంతృప్తిని ఇస్తుందని ఆయన వెల్లడించారు. గత ఐదేళ్లుగా పేద బ్రాహ్మణులకు అన్ని విధులుగా వ్యక్తిగతంగా అండగా ఉంటామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్

కాచిగూడ: నింబోలిఅడ్డ ప్రధానరహదారి లాల్‌బహదూర్ స్కూల్ వద్ద డ్రైనేజీ మ్యాన్‌హోల్ చెడిపోవడంతో స్థానిక ప్రజలు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను గుర్తించిన కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ బుధవారం జలమండలి అధికారులు, సిబ్బంది పిలిపించి డ్రైనేజీ మర్మతులు చేయించారు. ప్రజలు ఎవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కార్పొరేటర్ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఆర్.సంతోష్, మల్లికార్జున్, నాగరాజు, పి. సురేష్, ఎస్.రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నీట్‌పై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనలో ఆప్ విద్యార్థి సంఘం నాయకులు

కాచిగూడ: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బుధవారం బర్కత్‌పుర చమన్ వద్ద చేపట్టనున్న ధర్నా సందర్భంగా కాచిగూడ పోలీసులు బీసీ నేతలను ముందస్తుగా అరెస్ట్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణను మలక్‌పేటలోని ఆయన నివాసం వద్ద చాదర్‌ఘాట్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి కాచిగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గుజ్జ కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, కార్యదర్శి కోట్ల శ్రీనివాస్, నీలం వెంకటేష్, నందగోపాల్, బీసీ మహిళా జేఏసీ చైర్మన్ మట్ట జయంతిగౌడ్ తదితరులు మాట్లాడారు. దీనిపై ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకునేంత వరకు కేంద్రం ఈ అంశాన్ని పట్టించుకోకపోవడం సరికాదన్నారు. సుప్రీంకోర్టు ప్రశ్నించిన తర్వాత కూడా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) చిత్రమైన సమాధానాలు చెబుతుందని ఆరోపించారు. నీట్‌లో ఏకంగా 67 మందికి ఫస్ట్ ర్యాంక్ రావడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఒక్క మార్కు తేడాతోనే విద్యార్థుల ర్యాంకులు మారిపోతాయని, ఎంతోమంది అవకాశాలు కోల్పోతారని గుర్తు చేశారు.

కేంద్రమంత్రులు స్పందించాలి..

కవాడిగూడ : నీట్ పేపర్ లీకేజీపై కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలు స్పందించాలని ఆమ్ ఆద్మీ పార్టీ విద్యార్థి, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు మల్లంగి విజయ్, మాలోతు సురేష్‌బాబులు ప్రశ్నించారు. బుధవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ.. ఆప్ విద్యార్థి, యువజన సంఘాల జాతీయ కమిటీ పిలుపుమేరకు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా వెలుబడిన నీట్ ఫలితాల్లో ఏ ఒక్కసారి ముగ్గురికి మించి మొదటి ర్యాంకు రాలేదని, అలాంటిది ఈసారి ఏకంగా 67 మంది అభ్యర్థులకు మొదటి ర్యాంకు రావడం అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 23లక్షల మంది యువత భవిష్యత్తును నిర్ణయించే ఈ నీట్ పరీక్షలో ఇంత పెద్ద ఎత్తున అవకతవకలు జరగడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమేనని అభిప్రాయపడ్డారు. దీనిపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించి దోషులను శిక్షించాలన్నారు. దర్శనం రమేష్, శ్రీనివాస్, మౌనిక, అక్షయ్, మహ్మద్ సోహేల్, అహసాన్ పాల్గొన్నారు.

అరుంధతిరాయ్‌ని ప్రాసిక్యూషన్‌కు అనుమతించడం సరికాదు

ముషీరాబాద్: ఉపా కింద ప్రముఖ రచయిత, మేధావి అరుంధతిరాయ్‌ను ప్రాసిక్యూట్ చేయడానికి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి ఇవ్వడాన్ని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఖండిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర కమిటి అధ్యక్షురాలు అనురాధ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల్లో ఇది భాగమని విమర్శించారు. 14 ఏళ్ల క్రితం నాటి కేసులో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీ.కె.సక్సేనా అనుమతి మంజూరు చేయడం సరికాదన్నారు. ఐపీసీలోని 124బి, 153ఏ, 153బి,504, 505, 13 ఉపా వంటి సెక్షన్ల కింద ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతినివ్వడం ప్రజల ప్రజాస్వామ్య హక్కుల కోసం గొంతెత్తే వారిని అణిచి వేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తుందన్నారు. అరుంధతి రాయ్‌ని ప్రాసిక్యూషన్ చేసేందుకు ఇచ్చిన అనుమతిని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రజాస్వామికవాదులు ఖండించి, పౌర హక్కుల రక్షణకు ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన వివరాల ప్రకారం... 35 ఏళ్లున్న గుర్తు తెలియని వ్యక్తి యాకత్‌పురా - ఉప్పుగూడ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా.. రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లికి తలకొరివి పెట్టిన తనయ !



అంబర్‌పేట: నేటి సమాజంలో యుక్త వయసుకు రాగానే వివాహాలు చేసుకుని తల్లిదండ్రులకు దూరంగా వెళ్లిపోతున్నారు. మరి కొందరు తల్లిదండ్రులని అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో చేర్చి తమ బాధ్యత తీరినట్టు చేతులు దులిపేసుకుంటున్నారు. ఇలాంటి రోజుల్లో ఓ మహిళ తనకు అన్నదమ్ములు లేకపోవడంతో తల్లిదండ్రులకు అన్ని తానాయి నిలబడింది. చివరకు తల్లికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. వివరాలు ప్రకారం.. అంబర్‌పేటలో నివాసం ఉండే కెంచె శంకరయ్య, శంకరమ్మలకు కూమార్తె సరిత బీహెచ్‌ఈఎల్ పని చేసే శివశంకర్‌కు ఇచ్చి వివాహం చేశారు. అప్పటి నుంచి తల్లిదండ్రులను వదిలివేళ్లలేక ఆమె భర్తను ఒప్పించి ఇక్కడే ఉంటున్నారు. మూడేళ్ల నుంచి తల్లి ఆనారోగ్యం కారణంగా వివిధ ఆసుపత్రులకు తీసుకెళ్లి వైద్యం చేయించింది. ఆరోగ్యం క్షీణించి బుధవారం తల్లి మృతి చెందారు. కాగా నివాసంలో అంత్యక్రియలు నిర్వహించి తల్లికి తల కొరివి పెట్టిన హృదయ విదారక ఘటన పలువురిని కంటతడి పెట్టించింది.

ఆచూకీ లభ్యం

చిక్కడపల్లి : తప్పిపోయిన వృద్ధురాలి ఆచూకీని కనిపెట్టి వారి కుటుంబసభ్యులకు పోలీసులు అప్పగించారు. చిక్కడపల్లి సీఐ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం .. విద్యానగర్‌కు చెందిన మీసాల మరియమ్మ ఈనెల 15న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కాగా కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై మౌనిక కేసును దర్యాప్తు చేసి ఆచూకీ తెలుసుకున్నారు. సీఐ సీతయ్య ఎస్సైను అభినందించారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ ఎస్ఎన్. జావేద్, రైల్వే సీఐ ఆర్.ఎల్లప్ప

కాచిగూడ: రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.6 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే డీఎస్పీ ఎస్ఎన్.జావేద్, కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్పలు తెలిపారు. బుధవారం కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో వారు మాట్లాడుతూ.. హరియాణ రాష్ట్రానికి చెందిన అజాద్‌ఖాన్ (30), బోరబండలో నివాసం ఉంటూ.. బార్ అండ్ రెస్టారెండ్‌లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. మహారాష్ట్ర నాగాపూర్‌కు చెందిన పటాన్ వాసింఖాన్ (33) నగరంలోని సరూర్‌నగర్ వెంకటేశ్వరకాలనీలో ఉంటూ.. హోటల్‌లో పనిచేస్తున్నాడు. వీరిద్దరు స్నేహితులు. ఇద్దరు ముఠాగా ఏర్పడి జల్సాల కోసం రైళ్లలో బ్యాగులను దొంగిలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను పట్టుకుని వారి నుంచి 7 తులాల 4 గ్రాముల బంగారు ఆభరణాలు, 9 సెల్‌ఫోన్లు, ఒక ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. వీరిపై గతంలో కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులున్నాయని పోలీసులు వివరించారు.

వినతిపత్రం అందజేత



ప్రొఫెసర్ కోదండరాంకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కాచిగూడ: జీహెచ్‌ఎంసీలో విధులు నిర్వహిస్తున్న ట్రాన్స్‌పోర్టు వర్కర్లకు కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు లేఖలు రాసినట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం టీజేఎస్ కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్ ఆకుల శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ జీహెచ్‌ఎంసీ విభాగం ప్రధానకార్యదర్శి ఆదిల్ షరీఫ్‌లు ప్రొఫెసర్ కోదండరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. జీహెచ్‌ఎంసీలో ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ పడుతున్న ఇబ్బందులను వివరించారు. జీహెచ్‌ఎంసీలో 2వేల మంది ట్రాన్స్‌పోర్టు కార్మికులు గత 25 ఏళ్లుగా పనిచేస్తున్నారని, వారికి ఉద్యోగ భద్రత లేదన్నారు. చెత్తను తరలించే డ్రైవర్లు, క్లీనర్లు, ఇతర సిబ్బందిని బదిలీలు చేస్తున్నారని, వాటిని తక్షణమే నిలిపివేయాలని వారు కోరారు. యూనియన్ నేతలు ఉదయ్, నాగేష్‌రెడ్డి, నర్సింహ, బాలకృష్ణ, సాయికుమార్, సతీష్, వెంకటేష్, శ్రీశైలంగౌడ్, ప్రసాద్, భానుకుమార్, రమేష్ తదితరులున్నారు.



ఇంద్రధనస్సు అనాథాశ్రమంలో కాంగ్రెస్ నాయకుడు బిజ్జి శత్రు

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

అంబర్‌పేట్/ముషీరాబాద్ జోన్ పరిధిలో కాంగ్రెస్ మాజీ ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ వేడుకల్లో పలుచోట్ల పేదలకు పండ్ల పంపిణీ, అనాథాశ్రమాల్లో చిన్నారులకు మధ్యాహ్న భోజనంతో పాటు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

– అంబర్‌పేట్/ ముషీరాబాద్ జోన్ల బృందం



బాగ్ అంబర్‌పేట్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

కేంద్ర సహాయమంత్రికి శుభాకాంక్షలు



బండిసంజయ్‌ను సత్కరిస్తున్న ఆనంద్‌గౌడ్

అంబర్‌పేట: కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా బాధ్యతలు చేపట్టిన బండిసంజయ్ తొలిసారి రాష్ట్రానికి విచ్చేసిన సందర్భంగా ఆయనకు ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం బేగంపేట ఎయిర్‌పోర్టులో కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

వీధిలైట్లకు మరమ్మతులు



ముషీరాబాద్ : ముషీరాబాద్ డివిజన్‌లో బాపూజీనగర్, గంగపుత్ర కాలనీలలో వెలగని వీధిదీపాలకు బుధవారం విద్యుత్‌శాఖ అధికారులు మరమ్మతులు నిర్వహించారు. కొన్నిచోట్ల కొత్త విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పూసగోరఖ్‌నాథ్ తదితరులు డివిజన్‌లో వెలగని వీధిదీపాలను గుర్తించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలని కోరారు.

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం



ఛత్రపతి శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

అంబర్‌పేట: సమాజహితం కోరేది హిందూ ధర్మమని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు అన్నారు. బుధవారం గోల్నాక గంగనగర్ వద్ద స్వామి వివేకానంద విగ్రహం ప్రాంగణంలో హిందూ సామ్రాజ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌతమ్‌రావు ముఖ్య అతిథిగా హాజరైన శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. హిందూ ధర్మం పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ నేతలు శ్యామ్‌రాజ్, మూల రవీందర్‌గౌడ్, కె.నర్సింగ్‌రావు, రాంచందర్, శ్రీనివాస్, ఈశ్వర్, గోపాల్ తదితరులున్నారు.

అధిక ఫీజుల దోపిడీని నియంత్రించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రభుత్వ రంగంలోని విద్య, వైద్యం అభివృద్ధి కోసం తగిన నిధులు విడుదల చేసి ప్రభుత్వ హాస్పిటల్స్, స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని బీఎల్‌ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ డిమాండ్ చేవారు. బాగ్‌లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు, కార్పొరేట్ వైద్య సంస్థల అధిక ఫీజుల దోపిడీని నియంత్రించాలని ప్రభుత్వాన్ని కోరారు. జూన్ 30 వరకు స్థానిక సంస్థల ఎన్నికలు బీసీ రిజర్వేషన్ అనే అంశంపై జిల్లాలో రౌండ్‌టేబుల్ సమావేశాలు, జూలై 4న దొడ్డి కొమురయ్య వర్ధంతి భూ సమస్యపై రాష్ట్ర సదస్సు నిర్వహించాలని తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, బీఎల్‌ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్, రాష్ట్ర కార్యదర్శి కె.పర్వతాలు, ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు నూనె వెంకటస్వామి, పాండురంగాచారి, బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ వనం సుధాకర్, రాష్ట్ర నాయకులు ఎస్.సిద్ధరాములు, సావిత్రి, సునీల్‌కుమార్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరాను అరికట్టేందుకు చర్యలు

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్‌లోని మసీదు గల్లీలో నెలకొన్న కలుషిత నీటి సరఫరా నివారణకు యుద్ధ ప్రాతిపాదికన చర్యలు తీసుకుంటామని బీఆర్‌ఎస్ యువజన నేత ముఠా జైసింహ తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఆయన వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి బుధవారం బస్తీలో పర్యటించారు. కలుషిత నీటి సమస్యపై స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా.. సానుకూలంగా స్పందించిన ఆయన సమస్య పరిష్కరించేందుకు నూతన పైపులైన్ ఆధునీకరణకు ప్రతిపాదనలను సిద్ధం చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. పాత పైపులైన్ల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు శ్యామ్‌యాదవ్, ఎన్‌డీ సాయికృష్ణ, బీఆర్‌ఎస్ నేతలు విక్కీ, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

చిక్కడపల్లి: కలుషిత నీటి సరఫరా జరగకుండా వాటర్‌వర్క్స్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ పేర్కొన్నారు. చిక్కడపల్లిలోని బాపునగర్‌లో కలుషిత నీరు సరఫరా జరుగుతుందని స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ బుధవారం అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డివిజన్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, కలుషిత నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటర్‌వార్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, బీజేపీ నేతలు వినయ్‌కుమార్, రాజేందర్, సాయికుమార్, ఆనంద్‌రావు అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అసదుద్దీన్‌కు శుభాకాంక్షలు



అసదుద్దీన్ ఒవైసీతో స్థానిక నేతలు

ముషీరాబాద్: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని భోలక్‌పూర్‌కు చెందిన పలువురు ఎంఐఎం పార్టీ నేతలు బుధవారం ఆ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని ఆయన నివాసంలో కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు భోలక్‌పూర్‌లో మాట్లాడుతూ.. ఒవైసీ ఐదోసారి ఎంపీగా గెలిచి చరిత్ర సృష్టించారన్నారు. పేదల సంక్షేమ ఎంఐఎంతోనే సాధ్యమని పేర్కొన్నారు. నేతలు మహ్మద్ ఖాజా మొహియుద్దీన్, మహ్మద్ దావుద్‌అలీ, అల్లా కీరం, మహ్మద్ అన్వర్‌హుస్సేన్, మహ్మద్ షాహనాజ్ అలీ తదితరులున్నారు.

శ్రద్ధాంజలి



కీ॥శే॥ తలసాని శంకర్ యాదవ్ గారు

మోండా మార్కెట్ కూరగాయల వర్తక సంఘం అధ్యక్షులు

జననం: 08-03-1963 మరణం: 10-06-2024

"ఎందరో పేదవారికి అండగా నిలబడిన మీ సేవాభావం మాకు ఆదర్శనీయం
మోండా మార్కెట్‌కు ప్రెసిడెంట్‌గా మీరు అందించిన సేవలు చిరస్మరణీయం"

ఆ మహాత్ముడిని కోల్పోయిన వారి అమ్మగారు తలసాని లలిత భాయ్, సతీమణి విజయలక్ష్మి, కుమారుడు శివలాల్ యాదవ్, కోడలు రజిని, మనువడు సారీష్ యాదవ్ (సాండీ) సోదరుడు **తలసాని శ్రీనివాస్ యాదవ్** (MLA) మరియు **తలసాని కుటుంబ సభ్యులందరికీ** మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారికి ఎల్లప్పుడూ బలమై నిలబడతామని తెలుపుకుంటూ, వారికి ఆ భగవంతుడు మనోధైర్యాన్ని కలిగించాలని కోరుకుంటూ .. బాధాతప్త హృదయాలతో

వియ్యంకుడు-వియ్యపురాలు: **వల్లాల చిన్న శ్రీశైలం యాదవ్ - కస్తూరి**

కూతురు - అల్లుడు: **వల్లాల వర్ష-నవీన్ యాదవ్**, మనువడు: **వల్లాల అన్ష్ యాదవ్**

కూతురు - అల్లుడు: **ఎర్రగుడ్ల వైశాలి యాదవ్-ప్రభాకర్ యాదవ్**

మనుమరాండ్లు: ఎర్రగుడ్ల నిత్య యాదవ్, శ్రీ యాదవ్, మనువడు: ఎర్రగుడ్ల క్రిష్ యాదవ్

వల్లాల వారి కుటుంబ సభ్యులు

వి.సత్యనారాయణ యాదవ్-విజయలక్ష్మి
వి.రమేష్ యాదవ్-వసంత
వి.లక్ష్మి యాదవ్
వి.ప్రవీణ్ యాదవ్ (వెంకట్)
వి.రిషి యాదవ్-ఐశ్వర్య యాదవ్
వి.మౌనిక యాదవ్, వి.శ్రావణి యాదవ్
వి.సౌందర్య యాదవ్, వి.మల్లిక యాదవ్
వి.వెన్నెల యాదవ్, వి.ఆరవ్ యాదవ్

జె.అశోక్ యాదవ్ - జయలక్ష్మి
ఎం.ఆంజనేయులు యాదవ్ - నాగలక్ష్మి
పి.గోవర్ధన్ యాదవ్ - రాజ్యలక్ష్మి
పి.మల్లేష్ యాదవ్ - ధనలక్ష్మి

బీసుపల్లి వారి కుటుంబసభ్యులు

బి.మల్లేశం యాదవ్-మంగమ్మ
బి.మహేష్ యాదవ్-ధనలక్ష్మి
బి.మహేందర్ యాదవ్-వనజ
బి.యాదగిరి యాదవ్-రాణి
బి.భాను చందర్ యాదవ్-నవిత
బి.నర్సింగ్ యాదవ్-సుధ
బి.శ్రీకాంత్ యాదవ్-పూజ
బి.రాజ్ మల్లేష్ యాదవ్-సువర్ణ
బి.విహాన్ యాదవ్, వి.ఈషాన్ యాదవ్
బి.వేద్ యాదవ్, బి.బృవన్ యాదవ్
బి.ఆద్విక్ యాదవ్

నక్కా వారి కుటుంబ సభ్యులు

ఎన్.ఉమేష్ యాదవ్-సావిత్రి
ఎన్.శ్రీనివాస్ యాదవ్-సుఖన్య
ఎన్.రాహుల్ యాదవ్-శైలజ
ఎన్.రాహి యాదవ్
ఎన్.సాహస్ యాదవ్
ఎన్.స్వయం (రాఖీ) యాదవ్

కొల్లా అరవింద్ యాదవ్-నవనీత
బాతుక రవి యాదవ్-అనిత
గుర్రాల మధు యాదవ్-వాణి
మూసాపేట్ అరవింద్ యాదవ్-ప్రియాంక
పూచబోయిన అశోక్ యాదవ్-లత
యం.ప్రవీణ్ యాదవ్

పెద్దకర్మ: 20-06-2024,
గురువారం మధ్యాహ్నం 12:00 గం॥లకు

Lunch Follows

కార్యస్థలం: SVIT ఆడిటోరియం (మహబూబ్ కాలేజ్) ప్యాట్నీ సెంటర్, సికింద్రాబాద్ నందు పెద్దకర్మ జరుపబడును.

స్వర్గీయ తలసాని శంకర్ యాదవ్ గారు మీ తలపు లేని రోజు గడవదు మాకు, మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరలని కోరుకుంటూ మీకు ఇవే మా ఘన నివాళులు